క్లుప్తంగా

దాతల సహకారం మరువలేనిది

నందిగామ టౌన్: సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రం, మజ్జిగ పంపిణీకి దాతలు అందిస్తున్న సహకారం మువలేనిదని సేవా సమితి నిర్వాహకుడు కోటి సూర్యం తెలిపారు. స్థానిక మెయిన్ బజార్‌లో ఏర్పాటు చేసిన సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద మంగళవారం వెయ్యి మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన యార్లగడ్డ కిరణ్, తునికిపాటి రామకృష్ణ, హేమలత దంపతుల సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

31నుంచి విఘ్నేశ్వరుడి కల్యాణోత్సవాలు

నందిగామరూరల్: పట్టణంలో వేంచేసియున్న సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి వారి ఏకాదశ వార్షిక కల్యాణోత్సవాలను ఈనెల 31వతేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షుడు అన్నవరపు తిరుపతిరావు మంగళవారం తెలిపారు. 31న మంగళతోరణాలు, స్వామివారిని పెండ్లి కుమారుని చేయడం, 10.31 గంటలకు స్వామివారి దివ్య కల్యాణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జూన్ ఒకటిన సుప్రభాతం, మంగళవాయిద్యాలు, విశేష పూజలు, సహస్తనామార్చనలు, గరికపూజ, రెండున శ్వేతార్క పుష్పార్చన, సాయంత్రం ఆరుగంటలకు స్వామి వారి లడ్డూ ప్రసాదం వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కల్యాణ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు ఇంగ్లిష్ భాషపై శిక్షణ



జగ్గయ్యపేట అర్బన్: గ్రంథాలయంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన తరగతులను ప్రతిఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ సూచించారు. స్థానిక జిల్లాస్థాయి గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించారు. తొలుత విద్యార్థులచే కథల పుస్తకపఠనం చేయించారు. అనంతరం కథలను చెప్పించారు. అనంతరం ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు వినోద్‌బాబు ఇంగ్లిష్ గ్రామర్‌పై విద్యార్థులకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది శ్యామల, రమేష్, రాము పాల్గొన్నారు.

మాజీ ప్రధాని నెహ్రూకు ఘన నివాళి



కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మాజీప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని నిర్వహించారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి గ్రంథాలయాధికారి అల్లూరి రామచంద్రుడు, తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి నెహ్రూ అందించిన సేవలను వివరించారు. అనంతరం విద్యార్థులకు చెస్, డ్రాయింగ్, ఇంగ్లిష్‌పై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, కవి నీలం సర్వేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాకీ డ్రస్ వెనుక కరుణ

చర్మకారుడిని ఆదుకున్న ఎస్‌ఐ



కంచికచర్ల: ఖాకీ డ్రస్ వెనుక కాఠిన్యమేకాదు.. కరుణ, ఆప్యాయత కూడా ఉంటుందని నిరూపించారు కంచికచర్ల ఎస్‌ఐ అభిమన్యు. వివరాల్లోకి వెళితే.. కంచికచర్ల ఆర్టీసీ బస్టాండ్ బయట నెహ్రూబొమ్మ సెంటర్‌లో మండలంలోని గొట్టుముక్కల గ్రామానికి చెందిన ఉప్పలూరి వెంకయ్య అనే చర్మకారుడు నిత్యం చెప్పులు కుడుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. నందిగామ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న అభిమన్యు ఇటీవల కంచికచర్లకు వచ్చిన సమయంలో ఆ చర్మకారుడు రోడ్డు పక్కన కింద కూర్చుని, ఎండలో పాదరక్షలను కుడుతున్న సంఘటన చూసి ఎస్‌ఐ అభిమన్యు చలించిపోయాడు. ఈక్రమంలో ఎస్‌ఐ అభిమన్యు మంగళవారం కంచికచర్ల వచ్చి వెంకయ్యను ఆప్యాయంగా పలకరించి అతన్ని తనవెంట కార్పెంటర్ వద్దకు తీసుకువెళ్లాడు. వెంకయ్య కూర్చుని చెప్పులు కుట్టుకునేందుకు వీలుగా ఓ బల్లను తయారు చేయించి, గొడుగును కూడా అందజేశారు. తనకు సాయం చేసిన ఎస్‌ఐ అభిమన్యుకు వెంకయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. ఇది చూసిన కంచికచర్ల పట్టణ ప్రజలు ఎస్‌ఐ అభిమన్యు ఔదార్యాన్ని చూసి అభినందిస్తూ ఖాకీ డ్రస్ వెనుక కరుణ కూడా ఉందని వ్యాఖ్యానించారు.

పైపై పూత.. నిధుల మేత



అధ్వానంగా ఉన్న గొట్టుముక్కల రోడ్డు



కీసర-గండేపల్లి రోడ్డుపై పడిన పెద్ద గొయ్యి

- నాసిరకంగా రోడ్ల మరమ్మతులు
- తూతూమంత్రంగా పనులు
- రూ.లక్షల్లో బిల్లులు స్వాహా
- జేబులు నింపుకున్న కూటమి నాయకులు
- జనానికి తప్పని అవస్థలు

కంచికచర్ల: మరమ్మతులు చేశామనిపించాలి.. మమ అనిపించాలి..తారు కలిపినట్లు ఉండాలి.. పైపై పూత పూయాలి.. ఇలా ఉంది కూటమి ప్రభుత్వంలో కంచికచర్ల మండలంలో చేపట్టిన రోడ్ల మరమ్మతుల వ్యవహారం. నాలుగు నెలల కిందట ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో కంచికచర్ల మండలంలో చేపట్టిన రోడ్ల మరమ్మతుల్లో పూర్తిగా నాణ్యత లోపించింది. పలుచోట్ల ఆయా రోడ్లపై మట్టిపోసి మమ అనిపించగా, మరికొన్ని చోట్ల వేసిన తారు నాలుగు నెలలకే దెబ్బతినడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. బిల్లులు మంజూరయ్యే వరకు ఉంటే చాలు అన్నట్లుగా కూటమి నేతలు, కాంట్రాక్టర్లు వ్యవహరించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.లక్షలు స్వాహా..

కంచికచర్ల నుంచి చెవిటికల్లు వెళ్లే రోడ్డుకు రూ.40లక్షలతో మర్మమతులు చేపట్టగా, గండేపల్లి నుంచి వీరులపాడు మండలం బోడవాడ వెళ్లే రోడ్డుకు రూ.30లక్షలతో, చెవిటికల్లు నుంచి మున్నలూరు రోడ్డుకు రూ.10లక్షలతో, మున్నలూరు నుంచి మోగులూరు రోడ్డుకు రూ.8లక్షలతో మరమ్మతులు చేశారు. సుమారు రూ.88లక్షలతో చేపట్టిన ఈ రోడ్డు మరమ్మతు పనులు నాలుగు నెలలకే దెబ్బతినడంతో ఈ పనుల్లో నాణ్యత ఏమేరకు పాటించరనే విషయం అర్థమవుతుందని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. మరమత్తు పనుల్లో నాణ్యతకు తిలోదకాలివ్వడంతో ఆయా రోడ్లు మళ్లీ నాలుగు నెలలకే గోతులమయమయ్యాయి. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఆ నీరంతా రోడ్డుపై పడిన గోతుల్లో నిల్వ ఉంటుండటంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో ఆయా గోతుల విషయం తెలియక పలువురు గాయపడిన సంఘటనలు కూడా ఉన్నాయి. మొక్కుబడిగా మరమ్మతులు చేపట్టిన అధికారపార్టీ అనుకూలురైన కాంట్రాక్టర్లు ఎంచక్కా బిల్లులు దండుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఆయా రోడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గోతులమయంగా మారిన గండేపల్లి-జమ్మవరం వెళ్లే రోడ్డు

పనుల్లో నాణ్యత పాటించాం

గత నాలుగు నెలల కిందట చెవిటికల్లు, మున్నలూరు, గండేపల్లి, బోడవాడ జమ్మవరం గ్రామాల పరిధిలోని ఆయా రోడ్ల మర్మమతుల్లో నాణ్యత పాటించాం. ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా మరమ్మతు పనులు పూర్తిచేశాం.

– శశిభూషణ్, ఆర్ అండ్‌బీ డీఈఈ

సింగిల్ టెండర్లతో ప్రజాధనం దోపిడీ

ధ్వజమెత్తిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

జగ్గయ్యపేటఅర్బన్: సింగిల్ టెండర్ల విధానం, నామినేషన్ పద్ధతి ద్వారా మున్సిపల్ పాలకులు టీడీపీకి చెందిన కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ వారికి ప్రజాధనాన్ని దోచిపెడుతున్నారని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్‌హాలులో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన మంగళవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు.

కౌన్సిలర్లకు తెలియకుండానే టెండర్లు..

ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీకి కౌన్సిలర్ వట్టెం మనోహర్ మాట్లాడుతూ సింగిల్ టెండర్ల విధానంతో టీడీపీ వార్డుల్లోనే అభివృద్ధి పనులు కేటాయిస్తున్నారంటూ అభ్యంతరం వ్యక్తంచేశారు. కనీసం కౌన్సిలర్లకు కూడా సమాచారం ఇవ్వకుండా టెండర్లు పిలవడమేమిటని ప్రశ్నించారు. ముఖ్యంగా కాంట్రాక్టర్లు తీసుకువచ్చే మెటీరియల్‌పై సరైన నిఘా లేదని, బిల్లుల చెల్లింపు మాత్రం చేస్తున్నారని విమర్శించారు. రెండు బోరుపంపుల రిపేరు కోసం రూ.99వేలతో టెండర్లు పిలువగా రూ.88వేలకు పనులు పూర్తిచేస్తామంటూ సింగిల్ టెండర్ దాఖలైందన్నారు. ఒక్కో బోరుపంపు ఏర్పాటుకు రూ.20వేలు మాత్రమే ఖర్చవుతున్న నేపథ్యంలో ఇలా భారీ మొత్తంలో ప్రజాధనాన్ని టీడీపీ అనుకూల కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నారంటూ మండిపడ్డారు. ఈవిషయంపై చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఇక నుంచి టెండర్లు పిలిచేటపుడు ఆ సమాచారాన్ని కౌన్సిలర్లకు కూడా తెలియజేయాలని కమిషనర్ రామ్మోహనరావుకు సూచించారు. రెండునెలల కిందట బడ్జెట్‌లో ఆమోదించిన రూ.9కోట్ల విలువగల పనులకు నేటివరకు టెండర్లు ఎందుకు పిలువలేదని కౌన్సిలర్ మనోహర్ ప్రశ్నించగా, మరో రెండుమూడు నెలల్లో టెండర్లు పిలుస్తామని సమాధానమిచ్చారు.

ప్రజారోగ్యం దెబ్బతింటోంది..

కౌన్సిలర్ పందుల రోశయ్య మాట్లాడుతూ హాస్పిటళ్ల వ్యర్థాలను ఎర్రకాలువలో పడవేస్తున్నారని, దీంతో ఎర్రకాలువకట్ట వాసులు అనారోగ్యం పాలవుతున్నారంటూ సమస్యను కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. వేపలవాగు ప్రక్షాళనకు రూ.20లక్షలు కేటాయించాలని కౌన్సిలర్ మనోహర్ కోరారు. రెండోవార్డులో రూ.20వేలతో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయాలని అనేక సమావేశాల్లో కోరినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు, ఆక్రమణల తొలగింపు పేరుతో రూ.లక్షకు పైగా ఖర్చుచేయడమేమిటని కౌన్సిలర్ కొలగాని రాము ప్రశ్నించారు. అనంతరం డీఈఈ స్పందిస్తూ త్వరలోనే స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేస్తామని వివరించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు హఫీజున్నీసా, తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పేటలో మున్సిపల్ పాలకవర్గ పనితీరును ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ వట్టెం మనోహర్

సాగర్ కాల్వల పరిశీలన

పెనుగంచిప్రోలు:'కాలువలే కన్నీళ్లు పెడుతున్నాయ్' శీర్షికన ఈనెల 26న 'సాక్షి' దినపత్రికలో ప్రచురించిన కథనానికి నాగార్జునసాగర్ ప్రాజెక్టు(ఎన్నెస్పీ) అధికారులు స్పందించారు. సాగర్ జోన్-2 పరిధిలోని పలు కాల్వలను ఎన్నెస్పీ ఎస్‌ఈ మొహిద్దీన్ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్‌ఈ మొహిద్దీన్ మాట్లాడుతూ రైతులకు సక్రమంగా సాగునీరు అందించేందుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు. కాలువల్లో పూడికతీత, కంపచెట్లు తొలగింపుకు రూ.2.34కోట్లతో అంచనాలు పంపించగా, అనుమతులు కూడా మంజూరైనట్లు వివరించారు. జగ్గయ్యపేట డీసీ-1 పరిధిలో కొన్నిచోట్ల పనులు ప్రారంభించినట్లు వివరించారు. ఆగస్టులో సాగర్ జలాలు వస్తాయని, గండ్లు ఏమైనా ఉంటే పూడుస్తామన్నారు. జూన్ నెలాఖారుకు కాలువల మరమ్మతు పనులు పూర్తిచేస్తామన్నారు. నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా ఆయకట్టు చివరి భూములకు కూడా సాగునీరు అందిస్తామని వివరించారు. ఆయన వెంట ఎన్నెస్పీ ఈఈ కిషోర్, డీఈ రాంబాబు, జేఈ గోపాల్ ఉన్నారు.



ఈఈ, డీఈతో కలిసి ముండ్లపాడు వద్ద కాల్వను పరిశీలిస్తున్న ఎన్నెస్పీ ఎస్‌ఈ మొహిద్దీన్

సాక్షి ఎఫెక్ట్

విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ

నందిగామరూరల్: ప్రముఖ కంపెనీల సహకారంతో విద్యార్థినులకు ఉద్యోగ, ఉపాధికి తోడ్పాటునందించే నైపుణ్యాభివృద్ధి శిక్షణనిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు ఇన్ఫోసిస్ కంపెనీ ప్రత్యేకంగా రూపొందించిన బస్సులో మంగళవారం శిక్షణనిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రో కంట్రోలర్ బేస్ట్ ప్రాజెక్ట్స్, ఎనర్జీ కన్జర్వేషన్స్ తదితర అంశాలపై బస్సులో శిక్షణనిచ్చామన్నారు. 50మంది విద్యార్థునులకు శిక్షణనిచ్చి ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించినట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు, ట్రైనర్ భాను, నందిగామ స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చరణ్, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు శిక్షణనిస్తున్న ట్రైనర్

30న తిరువూరులో జాబ్‌మేళా

తిరువూరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం ఆధ్వర్యంలో తిరువూరులో ఈ నెల 30న జాబ్‌మేళా జరుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సుశీలరావు తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల లోపు వయస్కుగల 10, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ తదితర అర్హతలున్న అభ్యర్థులు మేళాకు హాజరుకావచ్చని చెప్పారు. పది కంపెనీలు ఈ మేళాలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తాయన్నారు. ఆసక్తిగల వారు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

రిటైర్డు లెక్చరర్‌కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నందిగామరూరల్: ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న పట్టణానికి చెందిన రిటైర్డు అధ్యాపకుడు అల్లు ప్రతాప్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు మంగళవారం పరామర్శించారు. ప్రతాప్‌రెడ్డి నివాసానికి వెళ్లి ప్రతాప్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. తగిన జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ జగన్‌మోహనరావు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, మన్నెం దాసు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పాడిరైతులకు పశువుల దాణా పంపిణీ

వీరులపాడు: పాడి రైతులకు 50 శాతం రాయితీపై పశువుల దాణా అందజేస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు వెస్లీ తెలిపారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని పాడి రైతులకు మంగళవారం ఆయన రాయితీపై పశువుల దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతులను ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. రాయితీపై అందిస్తున్న పశువుల దాణాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శంకర్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగించారు.. కాల్వలో పడేశారు

వీరులపాడు: మండలంలోని చౌటపల్లి, కొణతాలపల్లి గ్రామాల్లోని మైనర్ కాల్వల్లోని కంపచెట్లను తొలగించిన ఉపాధి హామీ పథకం కూలీలు, ఆ కంపచెట్లను కాల్వలోనే వదిలివేయడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. కాల్వలోని కంపచెట్లను తొలగించాలని కోరుతూ ఆయకట్టు చివరి భూముల రైతులు ఇటీవల ఉపాధి హామీ పథకం అధికారులను కోరారు. దీంతో ఉపాధి హామీ పథకం ధికారులు ఆయా గ్రామాల పరిధిలోని సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఉన్న కాల్వలోని కంపచెట్లను కూలీలచే తొలగింపజేశారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ తొలగించిన కంపచెట్లను కూలీలు తిరిగి కాల్వలోనే పడేయడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. కంపచెట్లన్నీ కాల్వలోనే ఉంటే సాగునీరు ఎలా ముందుకు సాగుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఉపాధి హామీ పథకం అధికారులు స్పందించి కాల్వలో పడేసిన కంపచెట్లను తొలగించాలని రైతులు కోరుతున్నారు.



మైనర్ కాల్వలోనే పడేసిన తొలగించిన కంప చెట్లు

రుతుక్రమ సమయంలో పరిశుభ్రత ముఖ్యం

నందిగామ టౌన్: కిశోర బాలికలు, మహిళలు రుతుక్రమ సమయంలో పరిశుభ్రత పాటించాలని, ముఖ్యంగా శానిటరీ ప్యాడ్స్ వినియోగించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ పీడీ శ్రీలక్ష్మి సూచించారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో మంగళవారం రుతుక్రమం-ఆరోగ్యం-పరిశుభ్రత అంశంపై జిల్లాస్థాయిలో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ లక్ష్మి మాట్లాడుతూ కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవటంతోపాటు ఆకుకూరలు, పండ్లు, వ్యాయామం, యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. రుతుక్రమం సమయంలో ప్రతి నాలుగు గంటలకొకసారి ప్యాడ్స్ మార్చుకోవాలన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి హిమోగ్లోబిన్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. అనంతరం విజయవాహిని ఫౌండేషన్ స్టేట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ భార్గవి మాట్లాడుతూ రుతుక్రమం సమయంలో ప్యాడ్స్‌ను వినియోగించాల్సిన తీరుతో పాటు, పౌష్టికాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణబాబు, వైద్యాధికారులు వాసంతి, కామేశ్వరి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాజేశ్వరరావు, సీడీపీవోలు లక్ష్మీభార్గవి, పుష్పలత, సత్యవతి, జ్యోత్స్న, కవిత, కిన్నెర, భాగ్యలక్ష్మి, ఏసీడీపీవో కృష్ణకుమారి, సూపర్‌వైజర్‌లు, ఆశావర్కర్‌లు, అంగనవాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ శ్రీలక్ష్మి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): యోగాతో మానసిక ఒత్తిడి దూరం కావడంతోపాటు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మండల పరిషత్ కార్యాలయ ఏవో మాధవ శర్మ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం యోగా ట్రైనర్ అశ్వనీ ఆధ్వర్యంలో సిబ్బందికి ప్రత్యేక యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలరోజుల పాటు యోగా మాసోత్సవాలు జరుగుతాయన్నారు. కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది యోగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కిషోర్, సిబ్బంది కుమారి, లక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల: ప్రతిఒక్కరూ యోగాసనాలు వేయడం ద్వారా వ్యాధుల బారినపడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ఆనందకమలకుమారి పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం యోగాసనాలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దినచర్యలో భాగంగా ఆసనాలు చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. యోగాసనాలు జీవితంలో ఒక భాగం కావాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిఒక్కరూ రోజుకు ఒకగంట ఆసనాలు వేయాలన్నారు. అంతేకాకుండా ఉదయం సమయంలో వాకింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: ఉరుకుల పరుగుల జీవితంగా ఉన్న నేటి యాంత్రిక జీవనంలో ఒత్తిడి నుంచి దూరమయ్యేందుకు ప్రతిఒక్కరూ తప్పకుండా యోగా చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పురపాలక సంఘం ఆధ్వర్యంలో యోగా శిక్షణనిచ్చారు. మున్సిపల్ సిబ్బంది, వార్డు సచివాలయాల సిబ్బందికి యోగాపై శిక్షణనిచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ జూన్ 21 వ తేదీన అంతర్జాతీయ యోగా డే సందర్భంగా ఈనెల 21 నుంచి వచ్చే నెల 21 వ తేదీ వరకు ప్రతిరోజు యోగా చేయాలని ఉద్యోగులకు సూచించారు.



చిల్లకల్లులో యోగా సాధన చేస్తున్న పేట మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది

యోగాతో ఒత్తిడి నుంచి దూరం

పెనుగంచిప్రోలు: యోగాసనాలతో ఒత్తిడి నుంచి దూరంగా ఉండవచ్చని ఎంపీడీఓ జి.శ్రీను పేర్కొన్నారు. యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్రలో రిజిస్టర్ అయిన సచివాలయ సిబ్బందికి ఆయుష్మాన్ వైద్యాధికారులు కె.వాణి, దుర్గామల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శిక్షకులు యోగాసనాలు వేయించారు. అనంతరం మండల స్థాయి ఉద్యోగులకు యోగాంధ్ర కార్యక్రమాలపై సమావేశం నిర్వహించడంతోపాటు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్ర, ఏఓ సిద్ధారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కంచికచర్లలో యోగాసనాలు వేస్తున్న సచివాలయ సిబ్బంది



పేటలో యోగా సాధన చేస్తున్న ఉద్యోగులు



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ శ్రీను, వైద్యాధికారులు వాణి, దుర్గామల్లేశ్వరరావు తదితరులు

చిన్నారులకు ఎమ్మార్ వ్యాక్సిన్ తప్పనిసరి

భూచవరం(జగ్గయ్యపేట): తొమ్మిది నుంచి 12నెలలు, 18నుంచి 24నెలలలోపు వయస్సు ఉన్న పిల్లలకు తల్లిదండ్రులు తప్పకుండా ఎమ్మార్ వ్యాక్సిన్‌ను వేయించాలని ప్రభుత్వ వైద్యాధికారి అనిల్‌కుమార్ సూచించారు. తట్టు నిర్మూలన వారోత్సవాలలో భాగంగా మంగళవారం వైద్యసిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు రెండు దఫాలుగా టీకాలు వేయించాలన్నారు. ముఖ్యంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని చిన్నారులను గుర్తించి టీకాలు వేయించేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమేష్, ఎంపిహెచ్‌వో రత్నం, పీహెచ్ఎన్ వెంకట్రావ్, అలివేలమ్మ, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

•కార్పొరేటర్ ఆత్మహత్యాయత్నం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ 39వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ మంగళవారం ఆత్మహత్యాయత్నం చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పురుగుల మందు తాగినట్లు సమాచారం. గొల్లపూడి ఆంధ్రా హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. వైఎస్సార్ సీపీ తరపున గెలిచిన ఆయన గతేడాది బీజేపీలో చేరారు.